క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



గ్రామ కమిటీ సభ్యులతో కన్వీనర్ నరసింహమూర్తి

పరిగి: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆపార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి సూచించారు. ఆదివారం మండలంలోని ఊటుకూరు, యర్రగుంట గ్రామ పంచాయతీ కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు దిలీప్‌కుమార్‌యాదవ్, బాలకృష్ణ, ఎంపీటీసీ అమరావతి, మండల, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత యోగా శిక్షణ



యోగా శిక్షకులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని మేళాపురంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వివేకానంద యోగథెరపీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 30 రోజులు ఉచిత యోగ శిక్షణ తరగతులు ముగిశాయి. ఆదివారం ముగింపు కార్యక్రమంలో యోగ టీచర్ బద్రీనారాయణ మాట్లాడుతూ యోగాసనాలతో ఒత్తిడి తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం యోగా శిక్షకులను సన్మానించారు. కార్యక్రమంలో కరే రమేష్, వెంకటేష్ బాబు, దేవాంగం శంకరప్ప, మహేంద్ర, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులు ఇవ్వలేరా?



శ్రీనివాసులు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

హిందూపురం టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఆప్కాస్ పారిశుధ్య కార్మికుడు 3వ డివిజన్‌కు చెందిన శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రాము, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, జగదీష్... శ్రీనివాసులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా మున్సిపాలిటీకి శ్రీనివాసులు ఎంతో సేవ చేశారన్నారు. అయితే చనిపోయిన కార్మిక కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందించకపోవడం విచారమన్నారు. మట్టి ఖర్చులు కూడా ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో హిందూపురం మున్సిపాలిటీ ఉండడం దురదృష్టకరమన్నారు.

ప్రకాశ్‌కు రాష్ట్ర అవార్డు



నేత కార్మికుడు ప్రకాశ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోటకు చెందిన చేనేత కారుడు ఎంపీ ప్రకాశ్ మగ్గంలో నేసిన 'రెయిన్ బో కళాంజలి'పట్టు చీరకు రాష్ట్ర ప్రశస్తి లభించింది. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన రాష్ట్ర చేనేత కార్మికుల దినోత్సవంలో ప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు. ప్రశస్తితో పాటు రూ.20 వేలు అందించారు. ప్రతి నెలా రూ. 8 వేలు చొప్పున పింఛన్ అందించనున్నారు.

'పురం'లో క్రైస్తవుల నిరసన ర్యాలీ



నినాదాలు చేస్తున్న క్రైస్తవులు

హిందూపురం: అన్ని మతాలను సమానంగా చూడాలని, సిక్కు, బౌద్ధ దళితుల మాదిరిగా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలని పట్టణంలో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం సీఅండ్‌ఐజీ మిషన్ చర్చ్, మిషన్ కాంపౌండ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ నాగేంద్ర కుమార్ అధ్యక్షతన శాంతి ర్యాలీ జరిగింది. దళిత క్రైస్తవుల కూడా ఎస్సీ హోదా కల్పించాలని నినదించారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ డాక్టర్ పి స్టీఫెన్ రాజ్, ట్రెజరర్ సాల్మన్ రాజ్, జాయింట్ సెక్రెటరీ అరుణ్ కుమార్, ట్రెజరర్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



సోమందేపల్లి: మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, పార్టీ శ్రేణులు

సోమందేపల్లి: ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి తర్వాత మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, గుడిపల్లి, వెలిదడకల, కావేటినాగేపల్లి గ్రామాల్లో ఆదివారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ 'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ జగనన్న .. సంక్షేమ పథకాలే పరమావధిగా భావించి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తే కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసి అక్రమ అరెస్టులతో కాలం గడుపుతోందన్నారు. సంక్షేమ పథకాలు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా ప్రజలకు పథకాలు అందించామని, నేడు టీడీపీ నాయకుల ఇళ్ల చుట్టూ ప్రజలు పథకాల కోసం తిరగాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వంలో మోసపోయారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, సర్పంచ్ జిలాన్‌ఖాన్, స్థానిక నాయకులు దాదాపీర్, శ్రీనివాసరెడ్డి, ఓబుళరెడ్డి, కళ్యాణ్, సూర్యప్రతాప్‌రెడ్డి, కిష్టప్ప, సాఫ్ట్‌వేర్ శీనా, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'చంద్రబాబు మోసాలు'

పెనుకొండ రూరల్: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వివరిస్తున్నారు. మండలంలోని శెట్టిపల్లి, కొండంపల్లి, కురుబవాండ్లపల్లి, గొల్లపల్లి, వెంకటగిరిపాళ్యం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. సంక్షేమ పథకాలు అమలుచేయకుండా కూటమి నేతలు చేస్తున్న మోసాలను నాయకులు వివరించారు. వైఎస్సార్‌సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సల్లా సూర్యప్రకాశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహా, సుధాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్లు నాగభూరు బాబు, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సాయిరాం నాయక్, నరసింహారెడ్డి, అంజనరెడ్డి, సిద్ధయ్య, గోపాల్‌రెడ్డి, చిన్న ఆంజినేయులు, వెంకటేష్, శ్రీరామిరెడ్డి, చెన్నకేశవులు, పూజారి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కొండంపల్లిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పరిగి: ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని ఎండగడదామని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని శాసనకోటలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల కన్వీనర్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. 15 నెలల కాలంలో కూటమి సర్కార్ ఏఒక్క హామీని పూర్తిగా నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతూ అరకొరగా పథకాలను అమలు చేస్తోందని నాయకులు విమర్శించారు. సంక్షేమానికి, అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ బాలాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శాసనకోటలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కూటమి మోసం.. ప్రజలకు శాపం



చంద్రబాబు మోసాల్ని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక తదితరులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: 'చంద్రబాబు చేసిన మోసాలు ప్రజలకు శాపంగా మారాయి. పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారు' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక విమర్శించారు. ఆదివారం హిందూపురం రూరల్ మండలంలో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె బాలంపల్లి, మలుగూరు, మనేసముద్రం పంచాయతీల్లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాల్ని వివరించారు. దీపిక మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజల ఆర్థిక కష్టాలు తొలిగాయన్నారు. అయితే ఇప్పుడు చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, జిల్లా కార్యదర్శులు తిప్పేరుద్రయ్య, గిరీష్ కుమార్, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు కవితారెడ్డి, సూర్యమోహన్, ఎంపీటీసీ తులసి, ఏకాశప్ప, నరశింహప్ప, చలపతి, మోహన్, శ్రీనాథ్, సుధాకర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డిదారి రాజకీయాలు సిగ్గు చేటు

కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక విమర్శించారు. ఆదివారం హిందూపురంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఎటు చూసినా అరాచకాలు చేస్తున్న కూటమి ప్రభుత్వ నేతలు, ప్రశాంతమైన ప్రాంతాల్లోనూ భయోత్పాతం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో దొడ్డిదారి రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. బీసీ నేత ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి హేయమని విమర్శించారు. బీసీలనే చిన్నచూపుతోనే దాడులకు తెగబడుతున్నారని, ఎన్నికల ప్రచారంలో పాల్గొనడమే నేరమా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో కూటమి నేతలు చేస్తున్న గొడవలను ఆపకపోగా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తుండటం దారుణమన్నారు. టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన రాముపై కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. పోలింగ్ కేంద్రాలను వారికిష్టమొచ్చినట్టు మార్చుకోవడం సరికాదన్నారు.

కష్టపడిన వారిని గుర్తిస్తాం

పార్టీ కోసం కష్టపడిన వారిని తప్పక గుర్తిస్తామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. ఆదివారం పట్టణంలోని 22వ వార్డు నింకంపల్లి మాజీ కౌన్సిలర్ షేక్ మహమ్మద్ రియాజ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యుల క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. అలాగే మహబూబ్‌బాషా ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అసిపుల్లా, టౌన్ ప్రెసిడెంట్ మన్సూర్‌ఖాన్, మహిళా విభాగం నాయకురాలు కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాధుచెట్టి సంఘం నూతన కమిటీ

హిందూపురం టౌన్: హిందూపురం సాదుచెట్టి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మధుర మీనాక్షి కళ్యాణ మండపంలో ఆ సంఘం కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్షుడిగా ఎస్.మంగేష్, ఉపాధ్యక్షులుగా ఎం.భాస్కర్, టీఎం.మునిరాజులు, సెక్రటరీగా వీజీ శ్రీధర్, కోశాధికారిగా ఎంఎస్.శ్రీధర్, జాయింట్ సెక్రటరీగా వినయ్‌కుమార్‌తో పాటు కమిటీ డైరెక్టర్లను ఎన్నుకున్నారు.

కమిటీ ఎన్నిక చెల్లదు

హిందూపురం పట్టణంలో సాదుచెట్టి సంఘంలో ప్రస్తుతం కమిటీ పనిచేస్తుండగా కొత్త కమిటీ ఎన్నిక ఎలా చెల్లుతుందని సాదుచెట్టి సంఘం ప్రెసిడెంట్ జీసీ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ ఉండగానే కొత్త కమిటి ప్రకటించడం సరికాదని అధ్యక్షులు, సెక్రటరీ నాగరాజు, ట్రెజరర్ జీకే.లక్ష్మీ ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఈ విషయంపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.



సాధుచెట్టి సంఘం నూతన కమిటీ సభ్యులు

మడకశిరలో విస్తారంగా వర్షాలు

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం రాత్రి కూడా విస్తారంగా వర్షాలు కురిశాయి. మడకశిర మండలంలో 35.6 మి.మీ, అమరాపురం మండలంలో 9.8, గుడిబండ మండలంలో 41.2, రొళ్ల మండలంలో 15.4, అగళి మండలంలో 11.8 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు రెవెన్యూశాఖ అధికారులు తెలిపారు.

అమరాపురంలో..

అమరాపురం: మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ వర్షం దంచి కొట్టింది. దీంతో రోడ్లలో వర్షపు నీరు ఏరులై పారింది. రెండు రోజుల నుంచి వర్షం కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. వర్షాలతో పంటలకు ఎంతో మేలని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అమరాపురంలో వర్షం కురుస్తున్న దృశ్యం

విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

పెనుకొండ: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మౌర్య రెసిడెన్సీలో యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా యూటీఎఫ్ పని చేస్తుందన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రయోగశాలగా చూడకూడదని, పరిరక్షించే దిశగా ఉండాలన్నారు.

మడకశిర: పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. యూటీఎఫ్ నాయకులు పాఠశాల ఆవరణంలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని శ్రీసత్యసాయి శల్య చికిత్సా కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు మాలింగప్ప, ప్రధాన కార్యదర్శి జోగప్ప, గుడిబండ మండల అధ్యక్షుడు మూర్ల గిరియప్ప తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండ: సమావేశానికి హాజరైన యూటీఎఫ్ నాయకులు

ఈరలింగేశ్వరస్వామికి పూజలు

అమరాపురం: మండల పరిధిలోని బంగారు పాళ్యం గ్రామానికి వెళ్లే రహదారిలో వెలసిన ఈరలింగేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.



అలంకరణలో ఈరలింగేశ్వరస్వామి



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

పరిగి: మండల కేంద్రమైన పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా జరిగింది. పాఠశాలలో 2007–08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కలియతిరిగి జ్ఞాపనాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు.

ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



ఆర్ అనంతపురంలో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు

మడకశిరరూరల్: ప్రజలను నమ్మించి వంచించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆదివారం ఆర్ అనంతపురం, ఆమిదాలగొంది పంచాయతీల్లో ఎంపీపీ కవిత, సర్పంచులు అంజినమ్మ, గీత అధ్యక్షతన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈరలక్కప్ప మాట్లాడుతూ ఏడాది పూర్తయినా కూటమి ప్రభుత్వంలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రుణాంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. జగనన్న కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు.

కమిటీల ఏర్పాటును ఆలస్యం చేయొద్దు

మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కమిటీల ఎంపికలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఆలస్యం చేయకుండా పారదర్శకంగా పూర్తిచేసి జాబితాను అందించాలని కోరారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి, పట్టణ కన్వీనర్ సతీష్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, తాలుకా బీసీ సెల్ అధ్యక్షుడు తిమ్మప్ప, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు బాబిరెడ్డి, జయపద్మ, రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి రేకులకుంట హనుమంతరాయ, జిల్లా యువజ విభాగం కార్యదర్శి లోకేష్, ఎంపీటీసీలు లక్ష్మీనరసమ్మ, కామరాజు, సర్పంచులు కరియన్న, రంగనాథ్, జేసీఎస్ మాజీ కన్వీనర్ నాగేంద్రయాదవ్, ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి మూర్తి, పట్టణ మహిళా విభాగం కార్యదర్శి అంజలి, తాలుకా, మండల కమిటీల విభాగం అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, నాయకులు మల్లికార్జున, శేషాద్రి, నర్సేగౌడ్, రంగనాథ్, దేవరాజు, సికిందర్, హనుమంతు, శివగంగప్ప, గంగాధర్‌గౌడ్, వెంకటేశ్‌రెడ్డి, శ్రీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదర్శన



పూలరథంపై కొలువుదీరిన రంగనాథస్వామి

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ గిరిప్రదర్శన ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి అర్చనలు, పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పూలరథంపై కొలువుదీర్చి గిరి ప్రదర్శన నిర్వహించారు.

13న మండల మీట్

పరిగి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 13 నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రెడ్డెప్ప ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సవిత అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పంచాయతీ కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని సర్పంచ్ కరియన్న కోరారు. ఆదివారం పంచాయతీ కేంద్రంలో పార్టీ శ్రేణులతో సమావేశమై కార్యక్రమం విజయవంతంపై చర్చించారు.

మడకశిర: పట్టణంలోని 7, 9, 10, 11, 12వ వార్డుల పరిధిలో సోమవారం ఉదయం 10 గంటలకు వేంకటరమణస్వామి ఆలయం వద్ద బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్ తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కారు బోల్తా - ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్: కారు అదుపుతప్పి బోల్తాపడటంతో ఇద్దరు గాయపడిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై అమ్మవారిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. నంద్యాలకు చెందిన కుటుంబం కారులో హిందూపురంలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో అమ్మవారిపల్లి వద్దకు రాగానే కారు డ్రైవర్ .. ద్విచక్ర వాహనాన్ని తప్పించే యత్నంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ ప్రదీప్, కళ్యాణి అనే మహిళ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించినట్లు పోలీసులు తెలిపారు.

'గుడ్డగుర్కి'కి ఆర్టీసీ బస్సు సౌకర్యం

మడకశిర: రొళ్ల మండలంలోని గుడ్డగుర్కి గ్రామానికి ఆర్టీసీ బస్సుసౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ డీఎం రంగభాష్యం తెలిపారు. రోజూ ఉదయం 10 గంటలకు బస్సు మడకశిర నుంచి బయలుదేరి చంద్రబావి, మిడిగేశి, గుడ్డగుర్కి, రత్నగిరి, కాకి, బ్యాడిగెర మీదుగా కైమర చేరుకుంటుందన్నారు. మళ్లీ ఈబస్సు అదే మార్గంలో మడకశిరకు తిరిగి వచ్చి హిందూపురం చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు బస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు తిని పాడి ఆవు మృతి



మృతి చెందిన పాడి ఆవు

మడకశిర: పట్టణంలోని ఎస్సీకాలనీకి చెందిన సిద్దమ్మ అనే మహిళకు చెందిన పాడి ఆవు ఆదివారం మృతి చెందింది. చెత్త దిబ్బల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలు తినడంతో పాడి ఆవు మృతి చెందినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. పాడి ఆవు మృతితో రూ.50 వేలు నష్టపోయినట్లు వాపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించింది.

మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తాం

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలోని 544ఈ జాతీయ రహదారి పక్కన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 2025 విద్య సంవత్సరానికి గాను అదనపు సీట్ల భర్తీకి అనుమతి వచ్చిందని ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు. ఈ ఏడాది జూన్ 25న ప్రవేశ పరీక్ష రాసిన వారిలో మెరిట్ విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు. ముఖ్యంగా 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అదనపు సీట్లు భర్తీకి ఆదేశాలు వచ్చినట్లు పేర్కొన్నారు. మెరిట్ లిస్టులో ఉన్న వారు ఈనెల 13న పాఠశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

పోలీసుల అదుపులో దొంగ?

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడతున్న దొంగను కియా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. మండలంలోని మునిమడుగుకు చెందిన వ్యక్తి కొద్దిరోజులుగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చోరీ చేసిన ద్విచక్ర వాహనాలు సమీప గ్రామాల్లో తక్కువ ధరలకే విక్రయిస్తున్నట్లు సమాచారం. పోలీసులు దొంగను అదుపులోకి తీసుకొని కొన్ని ద్విచక్ర వాహనాలను సైతం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9494767933, 9912220726